సాక్షి సూర్యాపేట

గురువారం • 29 • మే • 2025



మా మనుసు దోచాయి..

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు తమ మనుసును దోచాయని ఆఫ్రికన్ దేశాలకు చెందిన ప్రతినిధులు కొనియాడారు.

- 8లో



కేసీఆర్‌ను మించినోడు లేడు

సంక్షేమ పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మించినోడు లేడని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం 35°/26°

వాతావరణం

మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

కోవిడ్ కట్టడికి అలర్ట్..

కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్న వైద్య ఆరోగ్యశాఖ

- సూర్యాపేట, హుజూర్‌నగర్‌లో ఐసోలేషన్ వార్డుల ఏర్పాటు
- ఆక్సిజన్ ప్లాంట్లు, కాన్సన్‌ట్రేటర్లను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం
- ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు, మందుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- స్వీయ నియంత్రణ పాటించాలని ప్రజలకు డాక్టర్ల సూచన



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డు

సూర్యాపేటటౌన్ : దేశంలో ఐదేళ్ల తర్వాత మళ్లీ కరోనా కొత్త వేరియంట్ వస్తుండడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో కరోనా కేసులు నమోదైనా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు హుజూర్‌నగర్ లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు, మందుల కోసం ప్రతిపాదనలు పంపారు.

ర్యాపిడ్ కిట్ల కోసం ప్రతిపాదనలు

కొత్త వేరియంట్ రూపంలో కరోనా ముప్పు పొంచి ఉందన్న వార్తల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ సన్నద్ధమవుతోంది. కరోనా మొదటి, రెండో వేవ్ సమయంలో జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, నడిగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులు, ఆక్సిజన్ ప్లాంట్లు, కాన్సన్‌ట్రేటర్లు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆక్సిజన్, కాన్సన్‌ట్రేటర్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే కరోనా పరీక్షలకు సంబంధించి ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు, మందుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

20 బెడ్‌లతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు..

కరోనా ముందస్తు చర్యల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఒక వార్డులో 20 బెడ్లతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారికి ఈ వార్డులో చికిత్స అందిస్తారు. ప్రతి బెడ్‌కు ఆక్సిజన్ అందుబాటులో ఉంచడంతోపాటు కరోనా నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో..

కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి కరోనా సోకిన వ్యక్తులు వస్తే చికిత్స అందించడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఒకవేళ తీవ్ర జ్వరం కోవిడ్ లక్షణాలతో రోగులు వస్తే ప్రత్యేకంగా ఉంచడానికి వైద్యశాలలో ఒక గది ఉందని, దానిలో ఉంచి చికిత్స అందిస్తామని వైద్యశాల సిబ్బంది చెబుతున్నారు. కోదాడ వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్ కూడా అందుబాటులో ఉంది. రోగులు వస్తే చికిత్స అందించడానికి ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు చెబుతున్నారు.

హుజూర్‌నగర్‌లో తొమ్మిది బెడ్లు..



హుజూర్‌నగర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డు

కోవిడ్ కొత్త వేరియంట్ నేపథ్యంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆస్పత్రిలో మూడు ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశారు. ఒక్కో వార్డులో మూడు బెడ్ల చొప్పున మొత్తం తొమ్మిది బెడ్లను సిద్ధం చేసి ఉంచారు. ఆక్సిజన్ సిలిండర్, కాన్సన్‌ట్రేటర్లను అందుబాటులో ఉంచారు.

స్వీయ నియంత్రణ పాటించాలి



ప్రజలు స్వీయ నియంత్రణ పాటిస్తే కరోనా నుంచి రక్షణ పొందవచ్చు. కరోనా వైరస్‌పై జిల్లా వైద్యశాఖ అప్రమత్తంగా ఉంది. అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు నిర్వహిస్తాం. జిల్లాలో ఇంకా కరోనా కేసులు నమోదు కాలేదు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్షేత్రస్థాయిలో వైద్యారోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశాం.

–డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట

నడిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇంకా చేపట్టని ఏర్పాట్లు..



నడిగూడెం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

కరోనా మహమ్మారి మళ్లీ వస్తున్న నేపథ్యంలో నడిగూడెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నడిగూడెంలో 16 పడకల ఆస్పత్రి ఉంది. రోగులకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయి. వైద్య సిబ్బంది కూడా సరిపోను ఉన్నారు. కానీ కరోనాకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలపై ఎలాంటి ఏర్పాట్లు చేపట్టలేదు.

తుంగతుర్తిలో ప్రత్యేకంగా హాల్..



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బెడ్లు

తుంగతుర్తి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కరోనా చికిత్స కోసం ముందస్తు చర్యలు చేపట్టారు. కరోనా చికిత్స కోసం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా ఒక హాల్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ర్యాపిడ్ కిట్లు ఉన్నాయి. గ్లౌజులు, మాస్కులు కావాలని సంబంధిత వైద్యాధికారులకు తెలియజేసినట్టు స్థానిక డాక్టర్ తెలిపారు. కరోనా చికిత్సకు సంబంధించిన మెడిసిన్ అందుబాటులో ఉందని డాక్టర్ రాజు తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి రైతుల వద్దకే వ్యవసాయ శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రయోగశాల నుంచి భూమికి అనే నినాదంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు రైతుల వద్దకే వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్‌చార్జ్ డి.నరేష్ తెలిపారు. బుధవారం ఆయన కృషి విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజు 3 గ్రామాల చొప్పున 23 మండలాల్లోని గ్రామాల్లో హైదరాబాద్ నుంచి ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా వానాకాలం సీజన్‌కు అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, భూసార పరీక్షలు, డ్రోన్ వినియోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని వివరించారు.

అదనపు ఎస్పీగా రవీందర్‌రెడ్డి



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : జిల్లా పోలీస్ అడ్మిన్ అదనపు ఎస్పీగా రవీందర్‌రెడ్డి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా జిల్లా పోలీస్ అడ్మిన్ అదనపు ఎస్పీగా పనిచేసిన నాగేశ్వరరావు ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో రవీందర్‌రెడ్డి వచ్చారు. అనంతరం ఎస్పీ నరసింహను రవీందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావును ఎస్పీ సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

చివ్వెంల(సూర్యాపేట) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి డి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం చివ్వెంల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది వివరాలను మండల వైద్యాధికారి భవానిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ఏఎన్‌ఎంలు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాకాలం కావడంతో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన వెంట వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం అధికారి డాక్టర్, కోటి రత్నం, సిబ్బంది ఉన్నారు.

దేశభక్తిని పెంపొందించడం అభినందనీయం



కోదాడలో వంద అడుగుల జాతీయజెండా వద్ద సెల్యూట్ చేస్తున్న సినీహీరో సుమన్

కోదాడ: ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించడానికి ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని సినీ నటుడు సుమన్ అన్నారు. బుధవారం కోదాడలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయజెండాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్యంలో పని చేసి ఉద్యోగ విరమణ అనంతరం ఖాళీగా ఉండకుండా దేశసేవ కోసం పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఇటీవల పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన సైనికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, డాక్టర్ మధుసూదన్‌రావు, వెంకన్న, మహదేవ్, నవీన్, రహీం, నాగార్జున పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో డీపీఓ శ్రీధర్‌రెడ్డి, అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాకు మొదటి విడతలో మంజూరై నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, పారిశుద్ధ్యంపై అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 12,868 ఇందిరమ్మ ఇళ్లకుగాను ఫేజ్ వన్‌లో 4322 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఫేజ్ టూలో 8,546 లక్ష్యం ఉండగా 2017 లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని, మండల స్పెషల్ అధికారులు త్వరగా ఎంపిక పూర్తి చేసి నివేదిక సమర్పించాలన్నారు. రాజీవ్ యువ వికాసంలో భాగంగా జిల్లాలో 60,085 దరఖాస్తులకు 57,985 పరిశీలన చేసి బ్యాంకులకు పంపించామన్నారు. మిగిలిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిశీలించి బ్యాంకులకు పంపాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, నివాస ప్రాంతాల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, డీఎండబ్ల్యూఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎల్‌డీఎం బాపూజీ, డీపీఓ యాదయ్య అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



సూర్యాపేటలో ఓ దుకాణంలో పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట మార్కెట్‌లోని ఎరువుల దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్తీ విత్తనాలు అరికట్టి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతులకు వానాకాలం సీజన్‌కు సరిపడా కాంప్లెక్స్ ఎరువులు, యూరియా, యస్‌పీకే లాంటి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఏ రకం పత్తి విత్తనాలపై ఆసక్తి చూపిస్తున్నారనే విషయాన్ని ఆరా తీశారు. గుర్తింపు పొందిన డీలర్లు ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. కల్తీ విత్తనాలు అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఆర్డీఓ వేణుమాధవ్, ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారులు గణేశ్, కృష్ణ సందీప్ ఇతర అధికారులు ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజల న్యాయం కోసం ఉద్యమం

హుజూర్‌నగర్ : అన్ని వర్గాల ప్రజల న్యాయం కోసం సీపీఐ ఉద్యమిస్తుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు పేర్కొన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ మహాసభను నాయకులు మామిడి వెంకయ్య, సుందరి పద్మ, జక్కుల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయమైన ఆలోచనలతో దేశాన్ని ముందుకు నడిపించాలన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐది క్రియాశీలక పాత్ర అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, డి. ధనుంజయ నాయుడు, పి. వెంకటేశ్వర్లు, డి. మల్లేశ్వరి, ఎం. వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, ఎస్. కృష్ణ, ఎం. నరసయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, స్టాలిన్, సైదులు, వాసుదేవరావు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్: పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఐ జిల్లా, రాష్ట్ర నాయకులు

శిశువిక్రయాల ముఠా అరెస్ట్ కలకలం



శిశువులను అక్రమంగా దత్తత తీసుకున్న మహిళలు సూర్యాపేట పట్టణంలో ఆందోళన చేస్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

సూర్యాపేటటౌన్ : శిశువిక్రయాల ముఠాను పోలీసులు అరెస్ట్ చేయడం జిల్లాలో కలకలం రేపింది. వీరిలో 13మంది సభ్యులు ఉన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు దంపతులు ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాల నుంచి పిల్ల లను తీసుకొచ్చి సంతానం లేనివారికి అక్రమంగా దత్తత ఇవ్వడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం 10 మంది పిల్లలను, గతంలో 28మంది శిశువులను విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. 10 మంది పిలలను ఎక్కడెక్కడ అక్రమంగా దత్తత ఇచ్చారో గుర్తించి పోలీసులు వాహనంలో తీసుకురాగా.. దత్తత తీసుకున్న వారు ఆందోళన చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. పిల్లలను నల్లగొండలోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, రక్షా బంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేశారు.


ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతుల రాస్తారోకో



బొల్లంపల్లి వద్ద హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామ రైతులు బుధవారం 365 హైవేపై రాస్తారోకో చేశారు. దీంతో వందలాది వాహనాలు హైవేపై నిలిచిపోయాయి. విషయం తెలిసిన అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యం రూ.11,866 కోట్లు



2025-26 వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

- వ్యవసాయ రంగంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- చిన్నమధ్య తరహా పరిశ్రమకు సైతం..
- గతేడాదితో పోలిస్తే రూ.2871.86 కోట్లు అదనం

నాగారం : జిల్లా వార్షిక రుణ ప్రణాళికను అధికార యంత్రాంగం ఖరారు చేసింది. 2025–26 సంవత్సరానికి సంబంధించి ప్రాధాన్య, ప్రాధాన్యేతర రంగాలకు రూ.11,866.02 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలతోపాటు విద్య, గృహ, స్వయం సహాయక సంఘాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు అందించేలా ప్రణాళిక తయారు చేశారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి రూ.2871.86 కోట్ల అదనంగా పెంచారు.

రుణ ప్రణాళికలో ఇలా..

జిల్లాలో 3.03 లక్షల మంది పట్టా భూములు కలిగిన రైతులు ఉన్నారు. ఈ వానాకాలంలో జిల్లాలో 6.17 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారుల అంచనా. అయితే ఈ సారి వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు (వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గృహ నిర్మాణం తదితరాలు) రూ.9669.41కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు (వ్యక్తిగత రుణాలు, వాణిజ్యం, నాన్ ప్రియారిటీ సెక్టార్‌లకు) రూ.2196.79 కోట్లు కేటాయించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అన్నదాతలకు అండగా ఉండేలా రుణ మొత్తాన్ని పెంచారు. రైతులు పంట పొలాల్లో సాగునీటి కల్పన, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, భూముల అభివృద్ధి, విత్తనోత్పత్తి, వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వనున్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, స్వయం సహాయక సంఘాలకు, విద్య, గృహ రుణాలు అందించేలా రుణ ప్రణాళిక తయారు చేశారు.

పంట రుణాలు :	రూ.3861.42
వ్యవసాయం, అనుబంధ రంగాలు:	రూ.2999.49
చిన్న, మధ్య తరహా పరిశ్రమలు:	రూ.2418.38
ఇతర ప్రాధాన్యత రంగాలు:	రూ.390.12
నాన్ ప్రియారిటీ సెక్టార్‌కు :	రూ.2196.61

గత ప్రణాళికలో లక్ష్యానికి మించి చెల్లింపులు....

జిల్లా వ్యాప్తంగా 23 బ్యాంకులు ఉండగా వాటి పరిధిలో 162 బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణవార్షిక ప్రణాళికలో జిల్లాకు 8994.16 కోట్లు ఖరారు చేశారు. అనంతరం 100శాతం లక్ష్యం పూర్తికాగా.. ఆయా రంగాల ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో లక్ష్యానికి మించి అంటే గత ఏడాది రూ.1431.25 కోట్లు అదనంగా చెల్లింపులు చేశారు. గత ఏడాది లక్ష్యం రూ.8994.16 కాగా రూ.10425.41 కోట్లు రుణాలు చెల్లించారు.

వందశాతం అమలు చేస్తేనే..

జిల్లాలో పేద, మధ్య తరగతి కుటుంబాలు వ్యవసాయం, తదితర రంగాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటాయి. అలాంటి వారికి రుణాలు ఎంతగానో అవసరం. బ్యాంకుల ద్వారా రుణం మంజూరు కాకుంటే అధిక వడ్డీకి బయట అప్పుచేసి పెట్టుబడి పెడితే కష్టార్జితం మొత్తం అప్పులకు కట్టే వడ్డీకే సరిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. రుణ ప్రణాళిక తయారు చేయడమే కాదు.. వంద శాతం అమలు చేస్తేనే జిల్లా ప్రజలకు ఎంతో మేలు కలగనుంది.

లక్ష్యం మేరకు అందించేలా చర్యలు తీసుకుంటాం



లక్ష్యం మేరకు వంద శాతం రుణాలు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటాం. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్ పెరగడంతోపాటు మళ్లీ రుణాలు పొందడానికి అవకాశం ఉంటుంది. వార్షిక రుణ లక్ష్యం మేరకు ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాల్లో వంద శాతం లక్ష్యం పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాం.

–చింతల బాపూజీ, లీడ్ బ్యాంకు మేనేజర్, సూర్యాపేట

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

మద్దిరాల: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలుమల్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు తునికి వెంకన్న రోజుమాదిరిగానే బుధవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య తునికి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎం.వీరన్న తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కనగల్, రామగిరి(నల్లగొండ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి చెట్టును ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మండలం జి.చెన్నారం గ్రామ స్టేజీ వద్ద బుధవారం చోటు చేసుకుంది. కనగల్ ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం ముశంపల్లికి చెందిన తవుడోజు వెంకటాచారి(45) నల్లగొండ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. మర్రిగూడ బైపాస్‌లోని ఓ లాడ్జిలో మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన మేనకోడలి వివాహ పత్రికలు పంచేందుకు బుధవారం బైక్‌పై కనగల్ మండలం దర్వేశిపురం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జి. చెన్నారం గ్రామ స్టేజీ వద్ద బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని..



అరవింద్‌రెడ్డి (ఫైల్)

వేములపల్లి: రోడ్డు డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండల శివారులో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నామిరెడ్డి అరవింద్‌రెడ్డి (25) తన కారులో రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులోని చిత్రపరక వాగు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అరవింద్‌రెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో అరవింద్‌రెడ్డి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సరిహద్దు దాటొస్తున్న ఇసుక

- ఆంధ్రా నుంచి మిర్యాలగూడకు లారీల్లో అక్రమంగా తీసుకొచ్చి ఖాళీ స్థలాల్లో డంప్
- రాత్రివేళ కొనసాగుతున్న దందా



ఇటీవల ఆంధ్రా నుంచి వచ్చి మిర్యాలగూడలో పట్టుబడిన ఇసుక లారీ (ఫైల్)

మిర్యాలగూడ: ఆంధ్రాలో ఉచిత ఇసుక పథకం అమలవుతుండడంతో దానిని ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు అక్కడి నుంచి ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాలో ఓ ప్రజాప్రతినిధి కీలకంగా ఉండడంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రాత్రివేళ లారీల్లో పరిమితికి మించి ఇసుకను తరలిస్తూ ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేసి అవసరమైన సమయాల్లో లక్షలు ఆర్జిస్తున్నారు.

లారీలు, టిప్పర్లల్లోనే ఇసుక తరలింపు..

తెలంగాణలో ఇసుక డిమాండ్ ఎక్కువగా ఉండడంతో దాన్ని కొందరు వ్యాపారంగా మలుచుకున్నారు. తమకున్న లారీలు, టిప్పర్ల ద్వారా ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను మిర్యాలగూడకు తీసుకొచ్చి ఖాళీ స్థలాల్లో డంప్ చేసి అవసరమైన సమయంలో రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం మన ఇసుక వాహనం పేరిట ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. అలా చేస్తే ఇసుక డెలివరీ చేయడానికి చాలా రోజుల సమయం పడుతుండడంతో అవసరమైన వారు ఈ ఇసుక వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే రూ.3970కు వచ్చే ట్రాక్టర్ ఇసుక ఆఫ్‌లైన్‌లో మాత్రం రూ.5000 నుంచి రూ.7వేలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో ఏపీ నుంచి టిప్పర్లు, లారీల నుంచి ఇసుకను ఇక్కడకు తీసుకొస్తున్నారు. ఒక్కొక్క లారీలో 30టన్నులు, టిప్పర్‌లో 35టన్నుల ఇసుక పడుతుంది. కానీ వ్యాపారులు ఒక్కొక్క లారీలో 40 నుంచి 50టన్నులు, టిప్పర్‌లో 40 నుంచి 60 టన్నుల చొప్పున పరిమితికి మించి ఇసుకను తీసుకొస్తున్నారు.

నామమాత్రంగా కేసులు నమోదు..

ప్రధానంగా రాష్ట్ర సరిహద్దులో నిఘా లేకపోవడంతో ఈ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. అంతేకాకుండా కృష్ణా నది సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా పెద్దఎత్తున ఇసుక రవాణా సాగుతోంది. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలను పోలీసులు పట్టుకుంటున్నా నామమాత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారే తప్ప.. నియంత్రించేందుకు చర్యలు చేపట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసులు కూడా నమోదు చేస్తున్నారా లేదా అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆంధ్రా ప్రాంతం నుంచి కూడా ఇసుక రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందిస్తే పట్టుకొని కేసులను నమోదుచేస్తాం. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

పట్టుబడుతున్నా ఆగని దందా

మిర్యాలగూడ పట్టణంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రతిరోజు లారీల కొద్ది ఇసుక మిర్యాలగూడకు తరలివస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. నెల రోజుల క్రితం వంగమర్తి నుంచి మిర్యాలగూడకు ఇసుకతో తరలివస్తున్న మూడు టిప్పర్లను రామచంద్రగూడెం వైజంక్షన్ వద్ద పట్టుకున్నారు. స్థానిక ఇసుక లారీ యజమానులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకుని కేసు నమోదు చేశారు. 20 రోజుల క్రితం హనుమాన్‌పేట వద్ద ఆంధ్రాకు చెందిన ఓ ఇసుక లారీని పట్టుకున్నారు. ఆ విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేయగా మిర్యాలగూడకు చెందిన ఓ ప్రజాప్రతినిధికి చెందిన ఐదు లారీలు నడుస్తున్నాయని తెలియడంతో విస్తుపోయారు. ఆ ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు కేసు నమోదు చేయకుండానే వదిలేసినట్లు సమాచారం. తాజాగా మంగళవారం మిర్యాలగూడ పట్టణ శివారులోని రైల్వేట్రాక్ వద్ద ఓ ఇసుక లారీని స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఆ లారీ ఈ నెల 22న పర్మిట్ పొంది ఉంది. కానీ అందులో ఇసుక మాత్రం 27టన్నులకు గాను 56టన్నులు ఉంది. పరిమితికి మించి ఇసుక ఉండడంతో పాటు స్థానికంగా ఇసుకను డంప్ చేసి అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

సంక్షేమ పాలనలో కేసీఆర్‌ను మించినోడు లేడు

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: ప్రజా సంక్షేమ పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మించినోడు లేడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లోటాయన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచంలోనే మరెక్కడా లేవని అన్నారు. హామీ ఇవ్వని పథకాలును కూడా ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ కేసీఆర్ పథకాలే తప్ప కొత్తగా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందరికీ చేరువ చేసింది కేసీఆరేనన్నారు. రైతు భరోసా కాదు.. నేడు వ్యవసాయానికే భరోసా లేకుండాపోయిందన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు.

బాలుడిని అకారణంగా కొట్టిన కానిస్టేబుల్

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాలుడి తల్లిదండ్రులు



గాయాలను చూపుతున్న ప్రవీణ్

ఆత్మకూరు(ఎం): బాలుడిని పోలీస్ కానిస్టేబుల్ అకారణంగా కొట్టిన ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన మజ్జిగ ప్రవీణ్ 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం తమ వ్యవసాయ బావి వద్ద గొర్రెలను మేపుతున్న తన తల్లి విజయకు భోజనం తీసుకుని వెళ్లాడు. వారి భూమి పక్కనే 18 ఎకరాలను ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లింగంనాయక్ కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. తల్లికి భోజనం తీసుకెళ్లిన ప్రవీణ్‌కు దాహం వేయడంతో లింగంనాయక్‌కు భూమిలోని బోరు మోటారు ఆన్ చేసి బాటిల్‌లో నీళ్లు పట్టుకున్నాడు. అక్కడే మేత మేస్తున్న గొర్రెలు కూడా నీళ్లు తాగడానికి లబీడు పొలంలోకి వచ్చాయి. ఇది గమనించిన లింగంనాయక్ ఆగ్రహంతో ప్రవీణ్‌ను కర్రతో చితకబాదాడు. ప్రవీణ్ తల్లి విజయ అడ్డురాగా ఆమెపై కూడా దాడి చేశాడు. దీంతో వారు కానిస్టేబుల్ లింగం నాయక్‌పై అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇంతవరకు లింగంనాయక్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రవీణ్ తండ్రి కనకయ్య, తల్లి విజయ ఆరోపిస్తున్నారు. గాయపడిన ప్రవీణ్‌ను బుధవారం మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశంగౌడ్ పరామర్శించారు. కానిస్టేబుల్ లింగంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని కుర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్ఐ ఎస్. కృష్ణయ్యను వివరణ కోరగా.. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బావిలో పడిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి



రమేష్ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ట్రాక్టర్ అదుపుతప్పి బావిలో పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం బోరింగ్‌తండాకు చెందిన బానోత్ రమేష్(38) నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్ వద్ద మూడేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బండారి శ్రీనివాస్ కర్ర వ్యాపారంతో పాటు బొగ్గు బట్టీ నడిపిస్తున్నాడు. ఇటీవల రామన్నగూడెం గ్రామానికి చెందిన భూరెడ్డి రాంరెడ్డి చెలకలో పలు రకాల చెట్లను బండారి శ్రీనివాస్ కొనుగోలు చేయగా.. వాటిని బొగ్గు బట్టీకి తీసుకెళ్లడానికి బుధవారం ఉదయం ఆరుగురు కూలీలతో పాటు రమేష్ ట్రాక్టర్‌లో అక్కడకు వెళ్లారు. కూలీలు చెట్లను కోస్తుండడంతో రమేష్ ట్రాక్టర్‌ను పక్కకు పెడుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి దాదాపు 100 మీటర్ల దూరంలో గల బొర్రాజ మల్లయ్యకు చెందిన వ్యవసాయ బావిలో పడిపోయింది. బావి లోతుగా, నీళ్లు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్‌తో పాటు రమేష్ పూర్తిగా బావిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్‌సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రెండు మోటార్ల సహాయంతో బావిలోని నీటిని బయటకు తొలగించి రమేష్ మృతదేహాన్ని, ట్రాక్టర్‌ను బయటకు తీశారు. మృతుడికి ఇద్దరు భార్య, కుమారులు ఉన్నారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జానకిరాములు తెలిపారు. పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం రోజునే..

బానోత్ రమేష్ ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాలపురం పాఠశాలలో 2003లో పదో తరగతి పూర్తి చేయగా.. మిత్రులందరూ కలిసి బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకోవాలని తొందరగా పని ముగించుకొస్తానని ఇంటి వద్ద చెప్పి వెళ్లిన రమేష్ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులతో పాటు పదో తరగతి మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ.. ఇద్దరు దుర్మరణం



ఘటనా స్థలంలో శ్రీశైలం మృతదేహం

దేవరకొండ: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన బుధవారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలానికి చెందిన ఈడమోని శ్రీశైలం(44), అదే జిల్లా ఊరుకొండ మండలం రాచాలపల్లి గ్రామానికి చెందిన ఈరెటి బచ్చయ్య(40) వరుసకు బంధువులు. శ్రీశైలం, బచ్చయ్య వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరిద్దరు కలిసి పశువులను కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై మంగళవారం మిర్యాలగూడకు వచ్చారు. త్రిపురారం వద్ద వారికి అవసరమైన పశువులను కొనుగోలు చేశారు. రాత్రి కావడంతో అక్కడే బసచేసి బుధవారం ఉదయం స్వగ్రామాలకు బయల్దేరారు. ఉదయం 7గంటల ప్రాంతంలో దేవరకొండ పట్టణంలోని మనోజ్ థియేటర్ సమీపంలోకి రాగానే కొండమల్లేపల్లి నుంచి ఐరన్ లోడ్‌తో కల్వకుర్తి వైపు వెళ్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం, బచ్చయ్య తీవ్రంగా గాయపడ్డారు. శ్రీశైలం అక్కడికక్కడే మృతిచెందగా.. బచ్చయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు శ్రీశైలం కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ బస్సును ఢీకొట్టిన డీసీఎం

- బస్సు క్లీనర్ మృతి

నకిరేకల్: ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణ శివారులోని పద్మానగర్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మీస్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఛత్తీస్‌గడ్‌లోని జగదల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం రాత్రి 8గంటలకు బయల్దేరింది. బుధవారం తెల్లవారుజామున 5.30గంటల సమీపంలో నకిరేకల్ పట్టణంలోని పద్మానగర్ జంక్షన్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఇద్దరు ప్రయాణికులను దింపేందుకు డ్రైవర్ బస్సును ఆపాడు. ఛత్తీస్‌గడ్‌లోని బిలీసాపూర్‌కు చెందిన బస్సు క్లీనర్ చరణ్‌దాస్(36) బస్సు వెనుక డిక్కీలో ఉన్న లగేజీని తీస్తుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్‌దాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లిలోని కామినేని వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బస్సు డ్రైవర్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్టాచారి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం చరణ్‌దాస్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఎంజీయూ డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫలితాలు విడుదల

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో గతంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు చిట్టచివరిగా అవకాశం కల్పించి మార్చి, ఏప్రిల్ నెలల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు ఎంజీయూ సీఈఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

ప్రసాద తయారీ కేంద్రంలో చింతపండు చోరీ

- యాదగిరిగుట్ట ఆలయం నుంచి కొండ కిందకు కారులో బస్తాలు తీసుకెళ్తుండగా ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- నిందితులు ఆలయ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తింపు



యాదగిరిగుట్ట పైన కారులో తీసుకెళ్తున్న చింతపండు బస్తాలను పట్టుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పైన చింతపండు బస్తాలను ఆలయ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దొంగతనానికి పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. యాదగిరిగుట్ట పైన ఉన్న ప్రసాదాల తయారీ కేంద్రానికి సంబంధించిన గోదాం నుంచి మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు 9 చింతపండు బస్తాలను (సుమారు 3క్వింటాళ్లు) గోదాంలో ఉన్న కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తీసుకొచ్చారు. ఈ బస్తాలను కారులో పెట్టి కొండ కిందకు తరలించే ఏర్పాట్లు చేస్తుండగా.. పోలీస్ పెట్రోలింగ్ వాహనం రావడంతో ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు పట్టుకున్నారు. వారిద్దరు ప్రసాద విక్రయశాల విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సీహెచ్. గణేష్, పులిహోర మిషన్ ఆపరేటర్ పి. మధుగా గుర్తించి యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షోకాజ్ నోటీసులు జారీచేసిన ఈఓ..

చింతపండు బస్తాలు దొంగతనం జరిగిన విషయంపై ఈఓ ఎస్. వెంకట్రావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రసాదాల తయారీ గుమాస్తా పులెపాక నవీన్, పర్యవేక్షకుడు సత్యనారాయణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పేర్లు చెప్పొద్దని భయపెడుతున్నారు

చింతపండు దొంగతనంలో తమ పేర్లు చెప్పొద్దని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులైన మధు, గణేష్‌ను కొందరు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారి కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. ఆలయానికి చెందిన పంతుళ్లు క్రిష్ణమాచార్యులు (కన్నయ్య), సంతోష్ ప్రసాద విక్రయశాల విభాగం నుంచి చింతపండు తీసుకరమ్మని మధు, గణేష్‌కు సూచించారని వారి కుటుంబ సభ్యులు వెల్లడించారు. తమ పేర్లు చెప్పొద్దని రఘు అనే ఉన్నతాధికారి భరోసా ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

పర్యవేక్షణ లోపం..

చింతపండు బస్తాలను తీసుకెళ్లడానికి కొండపైకి వెళ్లిన కారును ఏ విధంగా పైకి అనుమతించారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారు ఎవరి రిఫరెన్స్‌తో కొండ పైకి వెళ్లిందనే విషయం ఆలయ అధికారులు చెప్పడం లేదు. అదేవిధంగా ప్రసాద విక్రయశాల విభాగంలో విలువైన సామగ్రి ఉన్నా తాళాలు లేకపోవడం ఆలయ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా లోపం స్పష్టంగా కనబడుతోంది.

హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

గరిడేపల్లి: గడ్డిపల్లిలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎం. స్నేహలత ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్‌రెస్ట్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి నెలకు రూ.23వేలు వేతనంగా కంపెనీ వారు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఘంటా సత్యనారాయణరెడ్డి, బండి వెంకటేశ్వరరావు, జెన్‌రెస్ట్ సంస్థ ప్రతినిధులు సోముబాల చవడారెడ్డి, జోనల్ హెడ్ సాయి, రీజనల్ మార్కెటింగ్ మేనేజర్, కాలేజీ ఇన్‌చార్జి శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం



నడిగూడెం: సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ వాణి

నడిగూడెం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రాం సంక్షేమ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి ఉత్తమ పురస్కారం అందుకున్నారు.

నారమ్మగూడెం వాసికి ప్రోత్సాహక బహుమతి

నిడమనూరు: అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న నిడమనూరు మండలం నారమ్మగూడేనికి చెందిన ఎక్కలూరి నక్షత్రారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందుకుంది. డిండి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నక్షత్రారెడ్డి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం, సీఎం కప్‌లో 400 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం, సూర్యాపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానం సాధించింది. నక్షత్రారెడ్డిని నారమ్మగూడెం మాజీ సర్పంచ్ దుబ్బాకుల రాంరెడ్డి, స్థానిక నాయకులు తుల సీరెడ్డి, గోవిందరెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఇక్కత్ వస్త్రాలు మా మనసు దోచాయి..



టూరిజం పార్కులో రాట్నం వడుకుతున్న ఆఫ్రికన్ యువతి



మగ్గాలను పరిశీలిస్తున్న ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు

- పోచంపల్లిని సందర్శించిన ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు



కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌లో చిటికి కట్టి మురిసిపోతున్న ఆఫ్రికన్ యువతి



సెల్ఫీ తీసుకుంటున్న కంటెంట్ క్రియేటర్లు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు తమ మనసును దోచాయని ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు కొనియాడారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా మధ్య, పశ్చిమ ఆఫ్రికన్ దేశాలకు చెందిన 30 మంది సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు బుధవారం పోచంపల్లిని సందర్శించారు. స్థానిక టూరిజం పార్కు, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌తో పాటు చేనేత వస్త్రాలను తయారీని పరిశీలించారు. మగ్గం నేసి, రాట్నం వడికి సందడి చేశారు. ఇక్కత్ వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సమాచార అసిస్టెంట్ డైరెక్టర్ మామిండ్ల దశరథ మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలు, కళలు, ప్రజల ఆచార వ్యవహారాలు తెలుసుకునేందుకు ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు ఇక్కడికి వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా మూలాలు మరువలేదు

– యోవానీ నాయుడు, దక్షిణాఫ్రికా క్రియేటర్

మా నాన్న తెలుగు వారు, మా అమ్మ తమిళనాడుకు చెందినవారు. మా పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికాకు వలస వెళ్లారు. భౌతికంగా ఇండియాకు దూరమైనా ఇక్కడి మూలాలు మరువలేదు. నాకు తెలుగు, తమిళం రాకున్నా భారత సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నాను.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెన్‌పహాడ్ : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచారం ఆవాసం గుడిబండ తండాలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలు, తండాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లక సైదులు, ఇటికాల శ్రీను, లోక్యా, భిక్షం, సంధ్య, వీరబోయిన సోమయ్య, భాస్కర్, విజయ్, హరిలాల్, బాలాజీ, మంగ్యా పాల్గొన్నారు.

రైస్‌మిల్లు ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ధాన్యం దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం తగదని బుధవారం బాలెంలలోని వజ్రా రైస్‌మిల్లు ఎదుట రైతులు ధర్నా చేశారు. దీంతో సూర్యాపేట – జనగామ రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సూర్యాపేట రూరల్ పోలీసులు అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

లింగన్న మృతి తీరనిలోటు

ఆత్మకూర్(ఎస్) : పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు వీరబోయిన లింగన్న మృతి విద్యార్థి లోకానికి తీరనిలోటు అని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు వీరబోయిన లింగన్న మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఏపూరులో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ అనుబంధ సంఘాల లింగన్న మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఇందూరు సాగర్, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, కనుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, అలుగుబిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నూతనకల్ : నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ వివరాలు, దుకాణదారుల లైసెన్స్‌లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, మందులను విక్రయించి విధిగా రసీదులను అందజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మురళీబాబు, దుకాణ యాజమాన్యులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న క్యామ మల్లేష్

తుంగతుర్తి : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం గొట్టిపర్తి గ్రామంలో మాట్లాడారు. ప్రజాపాలనలో రాష్ట్రం మొత్తం అస్తవ్యస్తంగా మారిందని, 18 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, దుగ్యాల రవీందర్ రావు, తడకమళ్ల రవికుమార్, బొజ్జ సాయి కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

మద్దిరాల : ఉపాధిహామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ గుండు వెంకన్న, టీఏలు మురళి, అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నర్సయ్య, వీరన్న, శివయ్య, శోభ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో తడిసిన ధాన్యం

అర్వపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులతోపాటు కాంటాలు అయిన ధాన్యం బస్తాలు తడిశాయి. కొన్నిచోట్ల ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అర్వపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



అర్వపల్లిలోని గ్రోమోర్‌లో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



తిరుమలగిరి : ఖోక్యానాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అర్వపల్లి : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం అర్వపల్లిలోని మన గ్రోమోర్‌తోపాటు పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడ ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ వేణుమాధవ్, ఏఓ గణేష్, కృష్ణ, సందీప్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించాలి

తిరుమలగిరి : ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బుధవారం తిరుమలగిరి మండలం ఖోక్యానాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్లు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటిని 600 చదరపు అడుగుల్లో మాత్రమే నిర్మించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇస్లావత్ యాకమ్మ, ఇస్లావత్ జగన్ నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించి ధాన్యం త్వరగా ఎగుమతి చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, సివిల్ సప్లయ్ బీఎం ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, ఏపీఎం మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఉన్నారు.

చర్యలు తీసుకుంటాం

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేసి పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏఈఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలి

అర్వపల్లి : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కాంటాలు అయిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించి, రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి, ఏఓ గణేష్, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి



బహుమతులు పొందిన చెస్ క్రీడాకారులు

సూర్యాపేట అర్బన్ : చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, మైత్రి గ్లోబల్ స్కూల్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ నరసింహ అన్నారు. మైత్రి గ్లోబల్ స్కూల్ అండ్ గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్ 7, 9, 11, 13, 15 విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన చెస్ పోటీలలో విజేతలకు బుధవారం పిల్లలమర్రి రోడ్డులోని మైత్రి గ్లోబల్ స్కూల్‌లో నగదు బహుమతి, షీల్డ్‌లను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ నెమ్మాది వెంకటేశ్వర్లు, రాడికల్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనిల్ కుమార్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కట్కూరి రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఆఫ్ ఎంజీ రామానుజన్ పాపయ్య, శ్రీనిధి కళాశాల కరస్పాండెంట్ పరశురాములు, విప్లవ్ కుమార్, చీఫ్ ఆర్బిటర్స్ రవికుమార్, కిరణ్, మౌనిక పాల్గొన్నారు.

మహాజన మార్గదర్శి మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న యాతాకుల రాజన్న మాదిగ

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మహాజన మార్గదర్శి మంద కృష్ణ మాదిగ అని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. పద్మశ్రీ అందుకున్న తర్వాత మంద కృష్ణ మాదిగ ఈ నెల 31న తొలిసారి ఓరుగల్లు వస్తున్న సందర్భంగా వేలాదిమంది తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సమన్వయకర్త చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, మాదిగ ఉద్యోగుల సమైక్య ఎంఈఎఫ్ రాష్ట్ర కోశాధికారి చింత జాన్ విల్సన్ మాదిగ, ఎంఈఎఫ్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర వీరన్న మాదిగ, ఎంఎస్‌పీ నాయకులు బోడ శ్రీరాములు మాదిగ, దైద శ్రీనివాసు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఆత్మకూరు మండలం అధ్యక్షుడు మేడి కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు బొజ్జ వెంకన్న మాదిగ, సూర్యాపేట మండల అధ్యక్షుడు తాటిపాముల నవీన్ మాదిగ, చివ్వెంల మండలం అధ్యక్షుడు కొంగల సతీష్ మాదిగ పాల్గొన్నారు.

చలో వరంగల్‌కు తరలిరావాలి

నూతనకల్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పద్మశ్రీ పురస్కారంతో ఢిల్లీ నుంచి తిరిగి వస్తున్న సందర్భంగా ఈ నెల 31న వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న స్వాగత కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పాల్వాయి పరశురాములు కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నకిరేకంటి వెంకన్న, మధు, గంగాధరి లక్ష్మీకాంత్, రవి, వెంకన్న పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది



బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, ట్రస్టు సభ్యులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. 10వ తరగతిలో 450కి పైగా మార్కులు సాధించిన 127 మంది ప్రభుత్వ పాఠశాలల యాదవ విద్యార్థులకు బుధవారం శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.4 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ ఊర రామూర్తి యాదవ్ అధ్యక్షన సూర్యాపేట జిల్లా కేంద్రంలోనీ ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తోపాటు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యాదవులు విద్య, ఆర్థిక, రాజకీయంగా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, నకిరేకల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య యాదవ్, ట్రస్టు సభ్యులు మర్యాద సైదులు యాదవ్, పోలెబోయిన నర్సయ్య యాదవ్, రాము యాదవ్, గొడ్డేటి సైదులు యాదవ్, కోడి సైదులు యాదవ్, మహేష్ యాదవ్, వజ్జ వీరయ్య యాదవ్, ఊర గాయత్రి యాదవ్, సుంకర బోయిన వెంకన్న యాదవ్, తూము వెంకన్న యాదవ్, శ్రీమాన్ యాదవ్, ఎల్లగాబోయిన మధు యాదవ్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

పెన్‌పహాడ్ : అనంతారం గ్రామంలోని నారాయణగూడెం పీఏసీఎస్ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 30 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. 30కేజీల బస్తాకు 50శాతం సబ్సిడీపై రూ. 2137.50 ధర ఉన్నట్లు తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

నూతనకల్ : రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీబాబు బుధవారం తెలిపారు. మండల పరిధిలో 30క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని శాంపిల్స్ కోసం ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. ల్యాబ్ అధికారుల రిపోర్టును బట్టి పంపిణీ తేదీలను తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లగడ్డ(సూర్యాపేట) : సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్కా కొమురయ్యలకు టీజీసీపీఎస్‌ఈయూ, టీపీయుఎస్ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. బాటసింగారంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్రస్థాయి అభ్యాసవర్గ ముగింపు ఉత్సవానికి వారు ముఖ్య అతిథులుగా రావడంతో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీసీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల దేవరాజు, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు పర్వతం సంధ్యారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి, టీపీయూఎస్ నాయకులు రామకృష్ణ, గోవర్ధన్, నాగేశ్వర రావు, జుట్టుకొండ నవీన్, శ్రీ దేవి, వెంకట్ రెడ్డి, గుండు ఆంజనేయులు, సురభి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పెన్‌పహాడ్ : సమాజంలో అసాంఘిక శక్తుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం చీదెళ్ల గ్రామంలో పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. క్షణికావేశం, స్వార్థంతో ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని, సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

సూర్యాపేట : సైబర్ మోసాలకు గురికావద్దని ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవరాజు, క్రాంతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ మల్లేశం, షీటీం మహిళా హెడ్ కానిస్టేబుల్ కవిత, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, కోదాడ షీ టీం మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి, ఉమా, సూర్యాపేట రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెన్‌పహాడ్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ గోపికృష్ణ అన్నారు. బుధవారం చీదెళ్లలో ఏర్పాటు చేసిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగ్, లోన్ యాప్‌లకు అలవాటు పడి కొందరు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. యువకులు, విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతోపాటు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో జరిగే వ్యవహారాలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మురళీధర్ రెడ్డి, కానిస్టేబుల్స్ వేణుగోపాల్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేస్తున్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు



అర్వపల్లిలో రహదారిని కమ్మేసిన ముళ్లపొదలు



చాకలిగూడెం సమీపంలో ఇలా..



కొత్తగూడెం శివారులో..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి–కొత్తగూడెం రోడ్డును ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు కమ్మేశాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఈ రహదారిపై అర్వపల్లి, కొత్తగూడెం, చాకలిగూడెం, రామన్నగూడెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఉండడం, రోడ్డు పూర్తిగా ధ్వంసమవడంతో రాకపోకలకు కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ రహదారిపై అడుగడుగునా మూలమలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకొని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



చివ్వెంల : సూర్యాపేటలోని కోర్టు ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు



తుంగతుర్తిలో..

చివ్వెంల: తుంగతుర్తిలో న్యాయవాది బానోతు ప్రతాప్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం కోర్టు ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల పరిరక్షణ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, న్యాయవాదులు మారపాక వెంకన్న, అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, విద్యాసాగర్‌రావు, దావుల వీరప్రసాద్, వీరేష్ కుమార్, ప్రకాశ్, సుధాకర్, శ్రీను, మంగులాల్, సతీష్, శ్రీనివాస్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న బానోత్ ప్రతాప్ నాయక్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం మండల కేంద్రంలోని సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. దాడి సంఘటనపై పోలీస్ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, జిల్లా కుమారస్వామి, జిలకర చంద్రమౌళి, గుగులోతు రాజారాం నాయక్, రవీందర్, వంగాల రాజు, వజీర్, ఫర్వీన్, బానోతు సతీష్, సైదులు, వంశీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

చివ్వెంల : కారు, బైక్ అపహరించిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత బుధవారం తీర్పు వెలువరించారు. సూర్యాపేటలో పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన మద్రు వెంకన్న 2024 నవంబర్‌లో సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద తన కారును నిలిపి టీ స్టాల్‌లో టీ తాగుతుండగా గుర్తుతెలియని వక్తులు అతడి కారును అపహరించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ కూడా సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద స్కూటీని ఆపి టీ తాగుతుండగా అతడి స్కూటీని కూడా ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ రాఘవులు ఆదేశాల మేరకు ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడింది సికింద్రాబాద్‌కు చెందిన కోరపాటి నర్సింగ్‌రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మన్యం జిల్లా పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన భాత ప్రసాద్‌గా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి, పీపీ బి. హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితులు నర్సింగ్‌రావుకు 21 రోజుల జైలు శిక్ష, భాత ప్రసాద్‌కు ఐదు నెలల 28రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ రవికుమార్ సహకరించారు.

కంఠమహేశ్వర స్వామికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న జగదీష్‌రెడ్డి, తదితరులు

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపగాని వెంకటనారాయణగౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు తోడు నరసింహారావు, సత్యనారాయణ, మర్ల చంద్రారెడ్డి కసగాని లక్ష్మి, బ్రహ్మంగౌడ్, బట్టిపెల్లి వెంకట్రాములు, గునగంటి వెంకన్న, భిక్షం, గునగంటి అంజి, కసగాని సతీష్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం చాటిన నేత ఎన్టీఆర్



కేక్ కట్ చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

సూర్యాపేట అర్బన్ : తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిన నాయకుడు మాజీ సీఎం ఎన్టీఆర్ అని బాల భవన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, విశ్రాంత అధ్యాపకుడు హమీద్‌ఖాన్ అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలోని బాల భవన్ సమ్మర్ క్యాంప్‌లో బుధవారం జ్ఞాన సరస్వతి కళా వేదిక, బాల్ భవన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బాల్ భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు, దాసరి ఎల్లయ్య, ఉమ, సత్యనారాయణ సింగ్ పాల్గొన్నారు.

సూర్యాపేటలోని నల్లాల బావి సెంటర్‌లో..

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, సినీ నటుడు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని నల్లాల బావి సెంటర్‌లో ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు కేక్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ.. బాధ్యతలు స్వీకరణ



అమీన్‌సింగ్

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూరు తహసీల్దార్‌గా అమీన్‌సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మద్దిరాల తహసీల్దార్‌గా పనిచేసిన అమీన్‌సింగ్ బదిలీపై ఇక్కడికి రాగా ఇక్కడ తహసీల్దార్ హరికిషోర్‌శర్మ నాగారం మండలానికి బదిలీపై వెళ్లారు.

నాగారం తహసీల్దార్‌గా హరికిషోర్‌శర్మ



హరికిషోర్ శర్మ

నాగారం : నాగారం మండల నూతన తహసీల్దార్‌గా ఎం.హరికిషోర్ శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆత్మకూర్ (ఎస్) తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై నాగారం మండల తహసీల్దార్‌గా వచ్చారు. కాగా నాగారం తహసీల్దార్‌గా పనిచేస్తున్న బ్రహ్మయ్య ఇటీవల బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ హరికిషోర్‌శర్మ మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతుల రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన హరికిషోర్ శర్మకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మద్దిరాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కంఠ్లమయ్య



కంఠ్లమయ్య

మద్దిరాల : మద్దిరాల మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కంఠ్లమయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత మూడు సంవత్సరాలుగా మద్దిరాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆర్.అమీన్‌సింగ్ ఆత్మకూర్(ఎస్) మండలాని కి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ కంఠ్లమయ్య మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సమస్యలపై కార్యాలయాన్ని సంప్రదించాలని అన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం

మద్దిరాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గత మూడు సంవత్సరాలు విధులు నిర్వహించిన తహసీల్దార్ అమీన్‌సింగ్ బుధవారం ఆత్మకూర్ (ఎస్) మండలానికి బదిలీ కావడంతో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది వేరు వేరుగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, మద్దెల భిక్షపతి, పొన్నం వెంకన్న, జాటోత్ చెన్నునాయక్, తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం తహసీల్దార్‌గా శ్రీకాంత్



శ్రీకాంత్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం తహసీల్దార్‌గా బాషపాక శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

ఆలయాల నిర్మాణ పనులకు భూమి పూజ



చెట్లముకుందాపురంలో దేవాలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కనకదుర్గాదేవి, మారెమ్మ, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, బొబ్బలమ్మ, అంకాళమ్మ, పోతురాజుల దేవాలయాల నిర్మాణాలకు బుధవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు, నవగ్రహ పూజలు నిర్వహించారు. భక్తులు నవధాన్యాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.